
దెబ్బతిన్న వరి పైరును చూపుతున్న చంద్రబాబు




మాట్లాడుతున్న చంద్రబాబు, టీడీపీ జెండాలతో యువకులు

వేదవతి ప్రాజెక్టును పూర్తి చేస్తాం

- ప్రతి పల్లెకు సాగు, తాగు నీరందిస్తాం
- నగరడోన జలాశయం పూర్తి చేస్తాం
- డిగ్రీ కళాశాలకు పక్కా భవనాల నిర్మాణం
- టీడీపీ ద్వారానే సామాజిక న్యాయం
- ఆలూరు ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

కర్నూలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి)/ఆలూరు/ఆదోని: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం ఆలూరు.. ఈ ప్రాంతంలో కరువును నివారించాలని 8 టీఎంసీల సామర్థ్యంతో వేదవతి ప్రాజెక్టు చేపడితే.. జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ దుర్మార్గుడు 3 టీఎంసీలు తగ్గించాడు.. నిధులు ఇవ్వలేక ప్రాజెక్టును కూడా ఆపేసి కరువు రైతులకు తీరని ద్రోహం చేశాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. ప్రజాగళం యాత్రలో భాగంగా శుక్రవారం ఆలూరు అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన రోడ్‌షోలో చంద్రబాబు మాట్లాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.వీరభద్రగౌడు, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుతో కలిసి చంద్రబాబు రోడ్‌షోలో మాట్లాడారు. ప్రజాగళం యాత్ర సభకు జనం పోటెత్తారు. ఎల్లార్తి రోడ్డు, ఆదోని రోడ్డు, బళ్లారి రోడ్డు ఎటు చూసినా జనం.. జనం ప్రభంజనమే. ఉప్పొంగిన ఉత్సాహంతో సైకో పోవాలి.. సైకిల్ రావాలనే పాటకు తెలుగు యువత కార్యకర్తలు చిందులు వేశారు. బాబు ప్రశ్నలకు జగన్ గుండెల్లో దడ పుట్టేలా ప్రజలు సమాధానం ఇచ్చారు. ఈ దుర్మార్గుడు మాకొద్దు.. రాక్షస పాలన అంతం చేద్దాం.. సైకిల్‌ను గెలిపిస్తామంటూ ప్రజలు బాబుకు సూచించారు. కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి చంద్రబాబు రెట్టింపు ఉత్సాహంతో ప్రసంగాన్ని కొనసాగించారు. రాబోయే ఎన్డీయే సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో ఆలూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామంటూ వరాల జల్లులు కురిపించారు. 8 టీఎంసీలతో వేదవతి ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తీసుకుంటా.. నదిలో నీరు లేకపోతే హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లు నింపి కరువు నేలకు మళ్లిస్తా. టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తాం. ఆదోనిలో మిరప ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు, డిగ్రీ కళాశాలకు ప్రత్యేక భవనాలు నిర్మాణం. జాతీయ రహదారితోపాటు ఆలూరు, హొళగుంద రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బుడగజంగాలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇప్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.


రోడ్‌షోలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వీరభద్ర గౌడ్, నాగరాజుతో చంద్రబాబు

సీమకు జగన్ ద్రోహం

రాయలసీమలో గత ఎన్నికల్లో 49 సీట్లు ద్వారా వైసీపీని గెలిపిస్తే.. ముఖ్యమంత్రి అయ్యాక జగన్ సీమకు తీరని ద్రోహం చేశారని చంద్రబాబు అన్నారు. ఒక్క డీఎస్సీ ఇవ్వలేదు.. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు.. ఆయన ఇచ్చిన వలంటీర్ల ఉద్యోగాల వల్ల యువత బాగు పడ్డారా అంటూ ప్రశ్నించారు. పేదల ఆదాయం పెరిగిందా.. గిట్టుబాటు ధర వచ్చిందా అంటూ నిలదీశారు. ఒక్క టీచర్ పోస్టయినా ఇచ్చాడా అంటూ ప్రశ్నించారు. విద్యపైన పెట్టిన ఖర్చు ఎంత.. మీరు దోచింది ఎంతో లెక్కలు చెప్పాలి అంటూ జగన్‌ను నిలదీశారు. కర్నూలు జిల్లాలో రూ.650 కోట్లతో మెగా సీడ్ పార్కును తీసుకువచ్చాను. రూ.350 కోట్లతో జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టును తెచ్చా. రూ.90 కోట్లతో విమానాశ్రయాన్ని నిర్మించాను. ఎమ్మిగనూరులో వంద ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కుకు శ్రీకారం చుట్టాను. ముచ్చుమర్రి లిఫ్టు, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులు తీసుకువచ్చాను. గాలేరు నగరి పూర్తి చేసి గండికోటకు నీరు మళ్లించి పులివెందులకు నీరు ఇచ్చాను. ఇది తెలుగుదేశం సాధించిన విజయాలు. జగన్ చేసిందేమిటో ఒక్కటైనా చెప్పగలడా అంటూ నిలదీశారు. చివరకు రోజంతా శ్రమ పడి సాయంత్రం ఓ క్వాటర్ మద్యం తాగుదామనే మద్యం ప్రియులను సైతం ముంచేశాడు. నాడు రూ.60 ఉన్న క్వాటర్ మద్యం.. ఇప్పుడు రూ.260కు చేరింది. మళ్లీ ఆయన అధికారంలోకి వస్తే.. రూ.500 అవుతుంది.. మద్యం డబ్బు అంతా ఎక్కడకు వెళ్తుందంటూ నిలదీశాడు. ప్రత్యేక హోదా తెస్తానంటూ మాట తప్పాడు. మద్యనిషేధం అని నిలువునా ముంచేశాడు.. సీపీఎస్ రద్దు అంటూ ఉద్యోగులను మోసం చేశాడు. ఇలాంటి మాట తప్పిన దుర్మార్గుడికి ఓటు వేస్తారా అని ప్రశ్నిస్తే.. వేయం.. వేయం అని గట్టిగా ప్రజలు కేకలు వేశారు.

శ్రమించే వారిని ఆదుకుంటా

ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన టీడీపీ కార్యకర్తలు, నాయకులను ఆదుకునే బాధ్యత నాది అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆలూరు నియోజకవర్గంలో వైకుంఠం కుటుంబం టీడీపీకి అండగా ఉంది. దివంగత వైకుంఠం శ్రీరాములు టీడీపీ బాగు కోసం పని చేశారు. కొందరు స్వార్థపరులు పార్టీని వీడినా.. వైకుంఠం జ్యోతి, వైకుంఠం ప్రసాద్‌లు టీడీపీ కోసం అండగా నిలిచారు. కప్పట్రాళ్ల బొజ్జమ్మ కుటుంబం టీడీపీకి దన్నుగా నిలుస్తుంది. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన కోట్ల సుజాతమ్మ అనివార్య కారణాల వల్ల ఆమె త్యాగం చేయాల్సి వచ్చింది. కోట్ల, వైకుంఠం, కప్పట్రాళ్ల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుంది. మీ రాజకీయ భవిష్యత్తు నాది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు వీరభద్రగౌడు, బస్తిపాటి నాగరాజులను గెలిపించే బాధ్యత మీరు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. గతంలో ఎన్నోసార్లు ఆలూరు వచ్చాను. ఇంతటి ఆదరణ ఇప్పుడే చూస్తున్నా. ఆలూరు నుంచి ఒక సామాన్య కార్యకర్త లింగాయతి సా మాజికవర్గానికి చెందిన వీరభద్ర గౌడుకు టికెట్ ఇచ్చాను. కురువ సామాజిక వర్గానికి చెందిన పంచలింగాల నాగరాజును కర్నూలు నుంచి ఢిల్లీకి పంపించేందుకు ఎంపీ టికెట్ ఇచ్చాను. ఆయన సామాన్య కుటుంబానికి చెందిన ఎంపీటీసీ. వీరిద్దరిని గెలిపించే బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు.

టీడీపీతోనే సామాజిక న్యాయం

టీడీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని చంద్ర బాబు అన్నారు. కర్నూలు పార్లమెం టులో వాల్మీకి వర్గానికి చెందిన రాఘ వేంద్రరెడ్డికి మంత్రాలయంలో, పార్థసారథికి ఆదోనిలో టికెట్ ఇచ్చాం. పత్తికొండలో ఈడిగ సామాజిక వర్గానికి చెందిన కేఈ శ్యాంబాబు, ఆలూరులో లింగాయతికి సామాజిక వర్గానికి చెందిన వీరభద్రగౌడు, కోడుమూరులో మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొగ్గుల దస్తగిరి, కర్నూలులో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన టీజీ భరత్‌కు టికెట్లు ఇచ్చాం. కర్నూలు ఎంపీగా కురువ సామాజిక వర్గానికి చెందిన పంచలింగాల నాగరాజును బరిలో దింపాం. ఎమ్మిగనూరులో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన జయనాగేశ్వరరెడ్డికి టికెట్ ఇచ్చాం. ఇది కదా సామాజిక న్యాయం అంటే. జగన్ చెప్పగలడా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడు, కర్నూలు ఎంపీ సంజీవకుమార్, ఆదోని ఇన్‌చార్జి కె.మీనాక్షి నాయుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుతోపాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు


యువకుడి ఉత్సాహం


భారీగా తరలి వచ్చిన జనాలు

రెండో రోజు ఆరు నామినేషన్లు


నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నంద్యాల జిల్లాలో ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూఖ్ నామినేషన్ దాఖలు చేయగా, శ్రీశైలం నియోజకవర్గానికి శిల్పా చక్రపాణిరెడ్డి శుక్రవారం మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఇద్దరు మినహా మిగతా నియోజకవర్గాల నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులెవరూ నామినేషన్లు వేయలేదు. శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జై భారత్ నేషనల్ పార్టీకి చెందిన అభ్యర్థి సయ్యద్ మహమ్మద్ సికిందర్ బాషా నామినేషన్ దాఖలు చేయగా, నందికొట్కూరు నియోజకవర్గం నుంచి బహుజన సమాజ్ పార్టీకి చెందిన గద్దల లాజర్, ఇండియా ప్రజాబంధు పార్టీ ఇండియాకు చెందిన అభ్యర్థి పల్లె నాగరాజు, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ నుంచి వెంకటేశ్వర్లు నామినేషన్లు వేశారు. నంద్యాల పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండో రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. మొదటి రోజు తొమ్మిది, రెండో రోజు ఆరు వెరసి జిల్లాలో ఇప్పటి వరకు 15 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్లకు ఇంకా ఆరు రోజులు సమయం ఉంది. అభ్యర్థులు తమకు అనుకూలమైన ముహూర్తం ఉన్న రోజు నామినేషన్ వేయడానికి ఏర్పాటు చేసుకుంటున్నారు. రెండ్రోజుల తర్వాత నామినేషన్లు ఊపందుకునే అవకాశం ఉంది.

26న భ్రామరికి కుంభోత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 19: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 26న భ్రమరాంబాదేవికి కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు శుక్రవారం కుంభోత్సవ ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక రెవెన్యూ, పోలీసు, దేవస్థానం యూనిట్ అధికారులు, సెక్షన్ అధికారులు, వైదిక సిబ్బంది, తహసీల్దార్ గుర్రప్ప, సీఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో డి. పెద్దిరాజు మాట్లాడుతూ కుంభోత్సవ వేడుకల కైంకర్యాలన్నింటినీ పరిపూర్ణంగా జరిపించాలని వైదిక సిబ్బందికి సూచించారు. క్షేత్ర పరిధిలో జంతు బలులు జరగకుండా అధికారులు సహకరించాలని అన్నారు. కుంభోత్సవం సందర్భంగా మద్యం అమ్మకాలను నిలిపేస్తున్నట్లు ఉత్తర్వులు ఇవ్వాలని కలెక్టరును కోరాలని అన్నారు.


సంజామల బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

రాష్ట్రాభివృద్ధికే పొత్తు

- అన్ని వర్గాలను మోసం చేసిన జగన్
- వైసీపీకి బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బీసీ పిలుపు

సంజామల, ఏప్రిల్ 19 : రాష్ట్ర అభివృద్ధి కోసమే బీజేపీ, జనసేనలతో టీడీపీ పొత్తు పెట్టుకున్నదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం నియోజకవర్గంలోని సంజామల మండల కేంద్రంలో నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరితో కలసి ప్రచార సభ నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న నాయకులకు ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ తాను మండలానికి, సంజామలకు చేసిన అభివృద్ధి ఎమ్మెల్యే కాటసాని చేశారా? అని ప్రజలను సూటిగా ప్రశ్నించారు. ఒక్క అవకాశం పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని అన్నారు. పంచాయతీల నిధులను మళ్లించి గ్రామాల అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేయడంతో నిరుద్యోగ యువకులు ఉపాధి లేక రోడ్లపై పడ్డారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పడుతుంటే తాను అండగా ఉన్నానని చెప్పారు. చంద్రబాబు ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, అన్ని రకాలుగా అలోచించే జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నారని స్పష్టం చేశారు. దీన్ని వైసీపీ నాయకులు రాజకీయం చేయడం సిగ్గు చేటని అన్నారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే తొలి సంతకం డీఎస్సీపై పెడతారని తెలిపారు. తాను ఎమ్మెల్యే కాగానే సంజామలలో షాదీఖానా నిర్మాణం చేపడతానని అన్నారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రభుత్వ రాయితీలు కల్పిస్తామన్నారు ఎంపీ అభ్యర్థి శబరి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ప్రజలకు ఏమైనా చేశారా అని నిలదీశారు. పెండేకంటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బీసీతోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమన్నారు. 2014లో బీసీ జనార్దన్‌రెడ్డి వెంట ఉండి ఆయన గమనించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్, ఆయన సోదరుడు రమణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయిప్రసాద్‌రెడ్డి కబ్జాకోరు

- ఇలాంటి వ్యక్తికి ఓటేస్తారా?
- పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల


మాట్లాడుతున్న ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల

ఆలూరు/ ఎమ్మిగనూరు/ఆదోని, ఏప్రిల్ 19: ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఓ పేకాటరాయుడు, కబ్జాకోరు అని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల ఆరోపించారు. శుక్రవారం ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఆమె 'ఏపీ న్యాయ యాత్ర' నిర్వహించారు. ఆలూరులోని అంబేడ్కర్ సర్కిల్, ఆదోనిలోని శ్రీనివాస భవన్ కూడలి, ఎమ్మిగనూరు పట్టణాల్లో నిర్వహించిన రోడ్‌షోలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మీద విరుచుకపడ్డారు. ఆయన కబ్జాకోరు అని అంటూ ఏదైనా స్థలం కోటి విలువ చేస్తే, ఆయన ఇంట్లోనే రిజిస్ట్రేషన్ చేయించుకుంటారట కదా...? అని ప్రజలను అడిగారు. ఇలాంటి దోపిడీదారుకు ఓటు వేస్తారా? అని అడిగారు. ఎమ్మెల్యే ఇక్కడి పత్తి రైతులకు కనీస గిట్టుబాటు ధర లేకుండా చేశారని ఆరోపించారు. వైఎస్సార్ ప్రభుత్వంలో పత్తి క్వింటం రూ.12వేలు పలికేదని, ఇప్పుడు రూ.6వేలు కూడా పలకడం లేదని అన్నారు. స్థానికంగా ఉన్న స్పిన్నింగ్ మిల్లులు మూతపడి వేల మంది ఉపాధి కోల్పోయి వీధిన పడినా ఎమ్మెల్యే పట్టించుకోలేదని, వాటిని తెరిచే ప్రయత్నం లేదని విమర్శించారు. అంతకు ముందు ఆప్ స్థానిక నాయకులు కాశింనాయుడు షర్మిలను కలిసి పూలగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు బాబురావు, ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్, డీసీసీ కార్యదర్శి కాశింవలి, సీపీఐ, సీపీఎం నాయకులు రంగన్న, రాముడు పాల్గొన్నారు.

అభ్యర్థులను ఖరారు చేసిన వైఎస్ షర్మిల : ఆదోని అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా వంశీ చైతన్య ఆసుపత్రి అధినేత రమేష్ యాదవ్, ఆలూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ కిషోర్‌లను షర్మిల ప్రకటించారు. ఎంపీ అభ్యర్థిగా రాంపుల్లయ్య యాదవ్‌ను గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఎమ్మిగనూరులో పర్యటించిన షర్మిల మాత్రం అక్కడ అభ్యర్థిని ప్రకటించలేదు.

కర్నూలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):

త్యాగాల పురిటిగడ్డ కందనవోలు. ప్రాంత ప్రయోజనాల కంటే ఆంధ్రప్రదేశ్ విశాల ప్రయోజనాలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ ఆనాడు రాజధాని త్యాగం చేయాల్సి వచ్చింది. బ్రిటీష్ పాలనలో 1947 ఆగస్టు 15 తర్వాత దేశ స్వాతంత్ర్యం తర్వాత కూడా రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాలు మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలోనే ఉన్నాయి. ఆ ప్రెసిడెన్సీలో జనాభా, భూ విస్తీర్ణంలో తెలుగు మాట్లాడే సీమాంధ్ర ప్రాంతమే అధికంగా ఉన్నా.. పాలన, ఆర్థిక వ్యవస్థల్లో తమిళీయుల ఆధిపత్యం అధికంగా ఉండేది. ఫలితంగా ఆంధ్రుల్లో భద్రతా భావం పెరిగి తమకంటూ ఓ ప్రత్యేక రాష్ట్రం ఉంటే రాజకీయంగా, ఆర్థికంగా గుర్తింపు లభిస్తుందనే భావన కలిగింది. తెలుగు మాట్లాడే వారంతా ఒక రాష్ట్రంగా ఏర్పడాలనే కోరిక.. ఆలోచన బలపడి అది ఆంధ్రోద్యమానికి నాంది అయింది. సాతంత్ర్యానికి ముందే ఉద్యమానికి బీజం పడింది. 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించినా మూడేళ్లలో విశాలాంధ్ర కోసం రాజధాని త్యాగం చేయక తప్పలేదు.

మూడేళ్ల ముచ్చటే..!



- ఆ ఆనందం మూడేళ్లకే ఆవిరి
- ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావంతో రాజధాని త్యాగం
- రాష్ట్ర విభజన తర్వాత తెరపైకి శ్రీబాగ్ ఒడంబడిక

ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా కర్నూలు

శ్రీబాగ్ ఒడంబడిక

మదనపల్లెలో 1937లో పట్టాభి సీతారామయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ప్రత్యేకాంధ్ర నిర్మాణంపై ఒక తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. రాయలసీమకు చెందిన పాపన్న గుప్త దీన్ని వ్యతిరేకించారు. మద్రాసు మంత్రివర్గంలో సీమకు సరైన ప్రాతినిధ్యం, తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణం, రాజధాని, విశ్వవిద్యాలయంలో సీమకు ఉపయోగం, సమన్యాయం.. వీటిని తేల్చనిదే ప్రత్యేక రాష్ట్ర ఆలోచన అవివేకం అంటూ రాయలసీమ ప్రయోజనాలు గట్టిగా వినిపించారు. పావన్నగుప్త అభిప్రాయాన్ని పట్టాభి ఏకీభవించారు. రాయలసీమ నాయకుల అపోహలకు, అనుమానాలకు తెరదించుతూ 1937 నవంబరు 16న చారిత్రాత్మకమైన శ్రీబాగ్ ఒడంబడిక కుదిరింది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే రాయలసీమకు ఎలాంటి ప్రత్యేకతలు ఉండాలనేదే ఒడంబడిక ముఖ్య సారాంశం.

● అమరజీవి త్యాగ ఫలితం


గాంధేయవాది పొట్టి శ్రీరాములు ప్రత్యేకాంధ్ర సాధన కోసం 1952 అక్టోబరు 19న ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈ దీక్షతో ఆంధ్ర అంతటా ఉద్యమ జ్వాల రగిలింది. అయినా.. ఆనాటి కేంద్ర ప్రభుత్వంలో చలనం రాలేదు. 58 రోజులుగా అకుంఠిత దీక్ష సాగిస్తున్న పొట్టి శ్రీరాములు 1952 డిసెంబరు 15న అమరజీవి అయ్యారు. ఆంధ్రుల్లో ఆగ్రహాజ్వాల రగిలి ఆందోళన హింసాత్మక ఉద్యమానికి దారి తీసింది. దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నట్లు నాటి ప్రధాని నెహ్రూ 1952 డిసెంబరు 19న లోక్‌సభలో ప్రకటించారు.

● ఎస్‌కే ధార్ కమిషన్

1948 జూన్ 17న భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు అధ్యాయనం కోసం కేంద్ర ప్రభుత్వం ఎస్‌కే ధార్ కమిషన్ ఏర్పాటు చేసింది. 1948 డిసెంబరు 10న భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సరైనది కాదంటూ ఆ కమిషన్ నివేదిక ఇచ్చింది. ఆంధ్రుల్లో ఆందోళన ఉప్పొంగింది. ఆంధ్రులను బుజ్జగిస్తూ ప్రధాని నెహ్రూ పటేల్, భోగరాజు, పట్టాభి సీతారామయ్యలతో ఏర్పాటు చేసిన అనధికార సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కొన్నేళ్లు వాయిదా వేయాలని.. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని.. మద్రాసును ఆంధ్రులు వదులుకోవాలని 1949 ఏప్రిల్ 1న నివేదిక ఇచ్చింది. ఆనాటి మద్రాసు ముఖ్యమంత్రి కుమారస్వామి రాజా నాయకత్వంలో టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల్ రెడ్డి, కళా వెంకట్రావు, నీలం సంజీవరెడ్డిలతో విభజన సంఘం ఏర్పాటు చేశారు. సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ప్రముఖ గాంధేయవాది స్వామి సీతారాం (గొల్లపూడి సీతారామశాస్త్రి) ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. 35 రోజుల తర్వాత 1951 సెప్టెంబరు 20న



ఆచార్య వినోభా భావే అభ్యర్థన మేరకు దీక్ష విరమించారు.



● కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం

కర్నూలు రాజధానిగా 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఉత్తరాంధ్రకు చెందిన శ్రీకాకుళం, విశాఖపట్నం, కోస్తాంధ్రలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలు, రాయలసీమకు చెందిన చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలతో పాటు బళ్లారి జిల్లాలోని రాయదుర్గం, ఆదోని, ఆలూరు తాలుకాలను కలుపుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అయితే.. ఎల్ఎస్ మిశ్రా కమిషన్ నివేదిక మేరకు బళ్లారి జిల్లా మైసూరు రాష్ట్రంలో కలిపారు. 1937 నాటి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కొత్తగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి కర్నూలు నగరం రాజధానిగా ప్రకటించారు. గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర గవర్నర్‌గా చందులాల్ మాధవ్‌లా త్రివేది (సీఎం త్రివేది)ని కేంద్రం నియమించింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే ఆంధ్రుల స్వప్నం సాకారమైంది.

● కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రం వివరాలు:

● ఆంధ్ర రాష్ట్ర అవతరణ	: 1953 అక్టోబరు 1
● రాజధాని నగరం	: కర్నూలు
● పెద్ద నగరం	: విశాఖపట్నం
● జిల్లాలో	: 11
● తొలి ముఖ్యమంత్రి	: టంగుటూరి ప్రకాశం పంతులు
● గవర్నరు	: చందులాల్ మాధవ్‌లా త్రివేది (సీఎం త్రివేది)

● మూడేళ్ల రాజధాని:

కందనవోలు ప్రజలకు రాజధాని వచ్చింది అనే ఆనందం.. సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. ఆ సంతోషం మూడేళ్లకే ఆవిరయింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా ఆంధ్ర రాష్ట్రం, ఆనాటి హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు మాట్లాడే తెలంగాణ ప్రాంతాన్ని కలిపి 1956 నవంబరు 1న విశాలాంధ్రగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. కర్నూలు ప్రజల త్యాగాల ఫలితంగా రాజధాని హైదరాబాద్‌కు మారింది. 58 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014 ద్వారా 2014 జూన్ 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను రెండు ముక్కలు చేశారు. 13 జిల్లాలో ఆంధ్రప్రదేశ్ (నవ్యాంధ్ర) ఏర్పాటుతో ఆనాడు విశాలాంధ్ర దృక్పథం కోసం కర్నూలులో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 1937 నాటి శ్రీబాగ్ ఒడంబడిక అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

● మూడేళ్ల పాలన వివరాలు:

● టంగుటూరి ప్రకాశం పంతులు 1953 అక్టోబరు 1 నుంచి 1954 నవంబరు 15 వరకు (13 నెలల 15 రోజులు).

● 1954 నవంబరు 15 నుంచి 1955 మార్చి 28 వరకు రాష్ట్రపతి పాలన (4 నెలల 13 రోజులు)

● బెజవాడ గోపాల్ రెడ్డి 1955 మార్చి 28 నుంచి 1956 నవంబరు 1 వరకు (7 నెలల 3 రోజులు)

● **హైకోర్టు** : గుంటూరు

● **జిల్లాలు** : కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, నెల్లూరు, కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం. (ఆ తరువాత ప్రకాశం, విజయనగరం జిల్లాలు ఏర్పడ్డాయి)

● ప్రత్యేక రాష్ట్ర ప్రతిపాదనకు బీజం

1912 మే నెలలో నిడదవోలులో జరిగిన సదస్సులో ప్రత్యేక రాష్ట్ర ప్రతిపాదన తెరపైకి వచ్చింది. 1913 మే 20న బయ్యా నరసింహేశ్వరశర్మ అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభలో ప్రత్యేకాంధ్ర ఏర్పాటుపై విస్తృత చర్చ జరిగింది. రాయలసీమ, విశాఖ ప్రాంత ప్రతినిధులు సుముఖత చూపలేదు. ప్రచార అంశాన్ని ఒక స్థాయి సంఘానికి అప్పగించాలని కొండా వెంకటప్పయ్య చేసిన సవరణతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధన కోసం తీర్మానం చేశారు. పట్టాభి సీతారామయ్య విస్తృతంగా పర్యటించి ఆంధ్రోద్యమానికి ప్రజాభిప్రాయం కూడగట్టారు. 1914లో విజయవాడలో రెండో మహాసభ జరిగింది. కాకినాడలో జరిగిన 4వ ఆంధ్ర మహాసభలో భోగరాజు పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్య వంటి మేధావులు భారత రాష్ట్రాల పునర్నిర్మాణం పేరిట ఒక కరపత్రాన్ని తయారు చేసి దేశ వ్యాప్తంగా పంచారు. అదే ఏడాదిలో మద్రాసులో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్‌లో చర్చకు వచ్చింది. 1918 జనవరి 22న ఆంధ్రకు జాతీయ కాంగ్రెస్ ప్రత్యేక విభాగం ఏర్పాటుతో ఆంధ్ర రాష్ట్ర పోరుకు అడుగులు వేగంగా పడ్డాయి.



జిల్లా కోర్టు



మునుపటి సెక్రటేరియట్ కార్యాలయం (ప్రస్తుతం మెడికల్ కాలేజీ ల్యాబ్)

డబ్బులిస్తేనే ప్రచారం

పైసామే పరమాత్మ



ఆదోని, ఏప్రిల్ 19: పైసలిస్తేనే జనాలు ప్రచారానికి వస్తున్నారు. లేదంటే ముఖం చాటేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒకటి నుంచి 6 మండలాలు వరకు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ మండల అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కలిపి వంద మందికి పైగానే ఉంటారు. వీరంతా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటేనే అభ్యర్థి గెలిచే అవకాశాలు ఉంటాయి. ఒక్కో నియోజకవర్గంలో ప్రచారానికి రూ.10 కోట్ల దాకా అవసరం అవుతాయని అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. వేసవి కాలం కావడంతో ఏసీ వాహనాలు, మజ్జిగ, భోజనాలు, మంచి నీరు, బిర్యానీలు, ప్రచార పత్రాలు, మద్యం, ఫ్లెక్సీలు ఇలా అన్నింటికీ భారీగా డబ్బు అవసరం అవుతోంది. ఏదైనా చిన్న గ్రామంలో ప్రచారానికి వెళ్లాలన్నా ఖర్చులకు ఇవ్వాలని కార్యకర్తలు, అక్కడి చోటామోటా నాయకులు అడుగుతున్నారు. ఒక్కో కార్యకర్త రోజుకు రూ.1000 దాకా అడుగుతున్నారని చెబుతున్నారు. ఇందుకు భోజనం, మద్యం అదనం. మండల స్థాయి నేతలకు రూ.లక్షల్లో చెల్లిస్తేనే ప్రచారానికి ముందుకు వస్తున్నారు. ఇవి కాకుండా స్థానికులకు అవసరమైన కొన్ని పనులు కూడా చేసి పెట్టాల్సి వస్తోంది. అడిగినంత ఇచ్చి ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి మరీ ఎన్నికల్లో భారీగా డబ్బును వ్యయం చేస్తున్నారు.

తనిఖీలు ముమ్మరం

కర్నూలు, ఏప్రిల్ 19: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలను తనిఖీ చేసేందుకు ఆయా చెక్‌పోస్టుల వద్ద పోలీసులతోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు కూడా ఉంటారు. తనిఖీల ప్రక్రియ వీడియో ద్వారా చిత్రీకరిస్తారు. ఈ నేపథ్యంలో ఎంత నగదు తీసుకెళ్లాలి.. ఎంత బంగారం వెంట తీసుకెళ్లాలో ఓ సారి తెలుసుకుందాం.

● **రూ.50వేల వరకే:** ఎవరైనా సాధారణ పౌరుడు తన అవసరాల నిమిత్తం రూ.50వేల లోపు నగదును తన వెంట తీసుకెళ్లవచ్చు. ఆపై తీసుకెళ్లేవారు ఆ నగదుకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలి. రూ.50వేల పైన పట్టుబడితే.. ఆ నగదును బ్యాంకు నుంచి డ్రా చేసినప్పటికీ ఏ ఉపయోగం కోసం తీసుకెళ్తున్నారో చూపించాలి. రూ.10 లక్షలపైన నగదు పట్టుబడితే.. ఎలాంటి పత్రాలు తీసుకెళ్లినా ఆ మొత్తాన్ని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తారు. ఆదాయ పన్ను శాఖ అధికారుల వద్ద ఆ మొత్తానికి లెక్కలు చూపాలి. ఎన్నికల ప్రచారంలో పాల్గొనే ఎమ్మెల్యే అభ్యర్థులు, వారి అనుచరులు నగదు తీసుకెళ్లే పరిమితి రూ.10వేలు మాత్రమే. ఆపైన ఉంటే కేసు నమోదవుతుంది. (ఇలాంటి సందర్భాల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, ఇతరత్రా నామినేషన్ పత్రాలు వెంట ఉంటే మాత్రం ఎన్నికల ప్రచారం అభ్యర్థిగానే పరిగణిస్తారు)

● **బంగారు విషయంలో:** పెళ్లయిన యువతి 50 తులాలు, పెళ్లి కాని యువతి 20 తులాలు, వృద్ధులు పది తులాలు బంగారం మాత్రమే వెంట తీసుకెళ్లవచ్చు. బంగారానికి సంబంధించిన లెక్కలు కచ్చితంగా చూపాల్సిందే. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రలోభాలకు గురి చేసే చీరలు, ఇతరత్ర గిఫ్టు సామగ్రిని వెంట తీసుకెళ్లినా కేసు నమోదు చేస్తారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.232 కోట్ల నగదు సీజ్ చేశారు. 66.93 కిలోల వెండి, 4.23 కిలోల బంగారు ఆభరణాలు సీజ్ చేశారు. తనిఖీల్లో పట్టుబడిన బంగారు, నగదును వెంట వెంటనే రిలీజ్ చేసేందుకు గ్రీవెన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఏరోజుకారోజు చర్యలు తీసుకుంటారు.

వలస కూలీలపై ఆరా


గోనెగండ్ల, ఏప్రిల్ 19: నామినేషన్ ఘట్టం గురువారం ప్రారంభమైంది. వివిధ గ్రామాలలో టీడీపీ, వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేయడమే గాక తమ పార్టీ అధినాయకులతో కూడా తమ తమ నియోజకవర్గాల్లో ప్రచారం చేయిస్తున్నారు. గ్రామస్థాయి నాయకులు తమకు ఇష్టం ఉన్న పార్టీలో చేరుతున్నారు. గోనెగండ్ల మండలంలోని కొన్ని గ్రామాలలో వైసీపీ నాయకులు బతుకు దెరువు కోసం వలస వెళ్లిన కూలీల ఆరా తీస్తున్నారు. తమ గ్రామాల నుంచి ఎంత మంది కూలీలు వలస వెళ్లారు? ఏ ప్రాంతాలకు వెళ్లారు, ఎక్కడ ఉన్నారు. ఎప్పుడు వస్తారు? అక్కడ వారికి రోజుకు ఎంత కూలీ ఇస్తున్నారు? అని తమ అనుచరులతో చర్చలు జరిపి సమాచారం తెలుకుంటున్నారు. గోనెగండ్ల మండలంలో దాదాపు 85వేల జనాభా ఉంది. అందులో 57,992 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే మండలం నుంచి దాదాపు 20వేల నుంచి 25వేల మంది వరకు హైదరాబాద్, గుంటూరు, రాయచూరు, రాజంపేట, రాజమండ్రి, గోవా తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. మండలంలోని బైలుప్పల, అగ్రహారం, గంజహళ్లి, నెరుడుప్పల, అలువాల, కులుమాల, గోనెగండ్ల, హెచ్ కైరవాడి, వేముగోడు, వీరంపల్లి, తిప్పనూరు, పుట్టపాశం పెద్దమరివీడు, చిన్నమరివీడు, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు తదితర గ్రామాలతోపాటు మరిన్ని గ్రామాల నుంచి కూడా కూలీలు పెద్ద సంఖ్యలో వలస వెళ్లారు. వారు ఉగాది పండగకు వచ్చి మళ్లీ తాము పనులు చేసే ప్రాంతాలకే వలస వెళ్లారు. ఈ నెల చివరి పెళ్లి ముహూర్తాలు 25న ఉండటంతో కొందరు తమ బంధువుల పెళ్లిళ్లు పూర్తి చేసి వెళ్లాలని చూస్తున్నారు. అయితే వలస వెళ్లిన వారితో ఆయా గ్రామాల నాయకులు ఫోన్ మాట్లా డి విషయం తెలుసుకుంటున్నారు. పోలింగ్ రోజుకు రెండు రోజుల ముందు తప్పని సరిగా గ్రామానికి చర్యలు తీసుకుంటున్నారు. వైసీపీ నాయకులు పోలింగ్ రోజు చాలా రోజులు ఉన్నప్పటికీ పగడ్బంది ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. నందవరంలో 46466 మంది ఓటర్లు ఉన్నారు. ఎమ్మిగనూరు టౌన్, మండలం కలసి 1,38679 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో నందవరం, ఎమ్మిగనూరు రూరల్ నుంచి ఎక్కువ మంది వలస వెళ్లినట్లు తెలుస్తోంది.



వలస ఓటర్లపై కన్ను
పోలింగ్ రోజు రప్పించేందుకు ఏర్పాట్లు

క్యా బాత్ హై..

సాయి ప్రసాద్ రెడ్డీ... నీ నాలుక కోస్తా..



ఎన్నికల ప్రచారంలో ఒకరిపై ఒకరు మాటల కత్తులు దూసుకుంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ప్రతిపక్షాలతో పాటు అభ్యర్థులు సైతం తమదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. ఈ క్రమంలో ఆదోని సిట్టింగ్ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డిపై బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి నిప్పులు చెరిగారు. 'ఏయ్ సాయి ప్రసాద్ రెడ్డీ.. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక కుటుంబం జోలికి వస్తే నాలుక కోస్తా.. జాగ్రత్తగా ఉండు..' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూకబ్జా చేయడం, పేకాట, మట్కా ఆడిస్తున్నావ్.. దీనిపై నువ్ సమాధానం చెప్పు. రేషన్ బియ్యం అమ్ముకుంటున్న నీవా నాతో మాట్లాడేది. ఐదు పెళ్లిళ్లు చేసుకున్నానంటూ నాపై విమర్శలు చేస్తావా? నీకు చదువు లేదు. బుద్ధి లేదు. కుటుంబం జోలికొస్తే తాటతీస్తా.' అంటూ హెచ్చరించారు.

\- ఆదోని

వైసీపీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్టే..!



చెల్లీ.. ఏంటీ లొల్లి

రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌పై విసుగెత్తిపోయారు. ఆ విసుగు ఆయన ఇంటి నుంచే మొదలైంది. సొంత చెల్లెలు వైఎస్ షర్మిల జగన్‌పై, ఆయన పార్టీపై ఎక్కడ పడితే అక్కడ ఎడాపెడా విమర్శలు చేస్తున్నారు. శుక్రవారం ఆలూరు రోడ్‌షోలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ... 'వైసీపీకి ఓటు వేస్తే.. డ్రైనేజీలో వేసినట్టే' అన్నారు. మొత్తం మీద ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ మన చేతికి చిప్ప ఇచ్చాడని విమర్శించారు.

\- ఆలూరు

పోలింగ్ బూత్‌లో 1,400 ఓట్లే ఎందుకు..?

తెలుసుకుందాం..



ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1,400 మంది ఓటర్లు ఉండే లా అధికారులు ఏర్పాట్లు చేస్తారు. ఇలా ఎందుకు చేస్తారో తెలుసా..? ప్రతి బూత్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్‌లు ఈ మూడు ఒక దానికొకటి అనుసంధానంగా పని చేస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1450 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పని చేసే వీవీ ప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకు కాగితం, స్లిప్పులు, ఓటింగ్ రోజు మాక్ పోలింగ్ ప్రక్రియకు వాడుతారు. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

\- కర్నూలు కలెక్టరేట్

మారెప్ప ఎక్కడప్పా...

ఉన్నా.. లేనట్టుగా..



ఆదోని, ఏప్రిల్ 19: ఆలూరు నియోజకవర్గంలో ఓసారి ఎమ్మెల్యే, ఓసారి ఉమ్మడి రాష్ట్రంలో కేబినెట్ మంత్రిగా పని చేసిన మూలింటి మారెప్ప నేడు రాజకీయాల్లో కనుమరుగై పోయారు. పంచాయతీ రాజ్‌లో ఇంజనీరింగ్‌గా ఉన్న మారెప్పను అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి పిలిచి ఆయనకు యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పదవి కేటాయించారు. 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆలూరు ఎమ్మెల్యేగా పోటీ చేయించి గెలిపించారు. రెండోసారి కూడా 2014 ఎన్నికల్లో పోటీ చేసిన మారెప్ప వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్ ఉమ్మడి రాష్ట్రాల్లో రాష్ట్ర ఎత్తిపోతలు, మార్కెటింగ్ శాఖ మంత్రిగా పని చేశారు. ఆలూరు నియోజకవర్గంలో ఐటీటీ, పాలిటెక్నిక్ కళాశాలలను ఆయన హయాంలోనే మంజూరయ్యాయి. ఆతర్వాత ఆలూరు అసెంబ్లీ స్థానం ఎస్సీ రిజర్వేషన్ నుంచి ఓసీ జనరల్‌గా మారడంతో మారెప్పకు అవకాశం లేకుండా పోవడంతో ఆయన నియోజక వర్గానికి దూరమయ్యారు. ఆ తరువాత వైసీపీలో చేరారు. కొంతకాలానికి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. తిరిగి నాలుగు నెలల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆలూరు నుంచి ఆయన ఉనికి పూర్తిగా తగ్గిపోయింది. బంధువులు మాత్రమే ఆస్పరి మండల రాజకీయాల్లో కీలకంగా ఉన్నారు.

ఆన్‌లైన్ వేదికపై ఎన్నికల సంగ్రామం

హీటెక్కుతున్న ఫోన్



కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 19: ఎన్నికల వేళ ఆన్‌లైన్ వేదికపై ఎన్నికల సంగ్రామం సాగుతున్నది. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఎక్స్(ట్విటర్), యూట్యూబ్ వేదికగా అధికార, విపక్షాలు ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. యువ ఓటర్ నాడిపట్టేందుకు ఎన్నికల బరిలో నిలిచిన ఆయా పార్టీల అభ్యర్థులు సామాజిక ప్రసార మాధ్యమాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల వేడి రోజురోజుకు పెరుగుతోంది. అధికార తెలుగుదేశం, వైసీపీ అభ్యర్థులు ఒకరిపై ఒకరు మాటల తూటాలను ఎక్కుపెడుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆప్పటికే తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ ఫాలో అవర్లు, కార్యకర్తలు వాట్సాప్, ఫేస్ బుక్‌లో ఓ రేంజ్‌లో హంగామా చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. వైసీపీ కూడా తెలుగుదేశం పార్టీతో దీటుగా హంగామా చేయడానికి ఆన్‌లైన్ వేదికలను ఉపయోగించుకుంటున్నది. ఈ సందర్భంలో తమ పార్టీల మేనిఫెస్టోలను అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సోషియల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తూ ఓటర్ల మనసును గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆన్‌లైన్ వేదికగా సవాళ్లు ప్రతి సవాళ్లతో తమ పోస్టుల ద్వారా ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

బిర్యానీ, బీరు బాటిల్ ఇవ్వాల్సిందే..

ఐదేళ్ల పండగ మరి..!



ఆదోని, ఏప్రిల్ 19: సాయంత్రమైంది. ప్రచారం ముగిసింది.. రేపు చూస్కుందాం అంటే కుదరదు. రాత్రికి కూడా ఓ బిర్యానీ ప్యాకెట్ పంచాల్సిందే. కావాలంటే ఓ బీరు బాటిల్‌ను కూడా ఇవ్వాల్సిందే. లేదంటే రేపటి ప్రచారానికి కష్టమే. మొత్తంగా ఎన్నికలు ప్రచారానికి వెళ్లే వారి కడుపును నింపడంతోపాటు మద్యం మంచి కిక్కును ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు హోటళ్లకు మంచి గిరాకీ తెచ్చిపెడుతున్నాయి. తక్కువలో తక్కువ అనుకున్నా రోజుకు లక్ష రూపాయల ఆర్డర్స్ వస్తున్నాయి. లీడర్లు. కొందరు బిర్యాని ఆర్డర్స్ చేస్తే.. కొందరు మాత్రం స్పెషల్ మెనూ, ఐదు రకాల వంటకాలు ఆర్డర్స్ ఇస్తూ ఎక్కడా తగ్గకుండా తమ గురించి గొప్పగా చెప్పుకునేలా నేతలు ఖర్చు పెడుతున్నారు.

అర్ధరాత్రి నీటి రగడ

● వైసీపీ నాయకుడు, ప్రజల మధ్య వాగ్వాదం

● వాహనాన్ని సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు

నందికొట్కూరు, ఏప్రిల్ 19: పట్టణంలోని 5వ వార్డులో వైసీపీ నాయకుడు అబ్దుల్లా నీటి వ్యాపారం ముదిరి పాకాన పడింది. గురువారం సాయంత్రం మున్సిపల్ డీఈ నాయబ్ రసూల్ వచ్చి టాటా ఏసీ వాహనంలో నీటి వ్యాపారం చేయకూడదంటూ వారించి, మళ్లీ అలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని చెప్పి వెళ్లారు. అయితే అర్ధరాత్రి మళ్లీ మోటారు వేసుకొని నీటిని ట్యాంకర్‌లో నింపుకొని వెళ్లే ప్రయత్నం చేయడంతో స్థానికులు అడ్డుచెప్పారు. దీంతో నాయకుడు, స్థానికులు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని కాలనీ వాసులతో జరిగిన ఘటన గురించి ఆరా తీశారు. వివాదానికి కారణమైన నీటిని సరఫరా చేస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 19: ప్రతి ఓటు విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని దృఢమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్వీప్ యాక్టివిటీలలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై సంతకాల ప్రచార భారీ ఫ్లెక్సీని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు ప్రారంభించారు. భారీ ఫ్లెక్సీపై ముందుగా కలెక్టర్ సంతకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని చైతన్యవంతమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పేందుకు భాగస్వామ్యం కావాలన్నారు. కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'అభ్యర్థుల ఖర్చులను పకడ్బందీగా నమోదు చేయాలి'

ఆత్మకూరు, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఖర్చుల వివరాలను పకడ్బదీంగా నమోదు చేయాలని నంద్యాల, శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు టికరామ్ మీనా, ఐఏఆర్ఎస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరులోని శ్రీశైలం రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి చేరుకుని రాజకీయ పార్టీల, ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల ఖర్చుల వివరాల నమోదు గురించి రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇప్పటివరకు శ్రీశైలం నియోజకవర్గం వ్యయ పరిశీలన బృందం నమోదు చేసిన ఖర్చుల వివరాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట అదనపు వ్యయ పరిశీలకులు శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

'దళితుల ద్రోహి జగన్'

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 19: దళితులకు రావాల్సిన 27 సంక్షేమ పథకాలను అటకెక్కించి దళిత ద్రోహిగా చరిత్ర పుటల్లో నిలిచిన జగన్ ప్రభుత్వాన్ని సాగనంపాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు ఎనుముల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వం దళితుల సంక్షేమ పథకాలను రద్దుచేసిందే కాకా ఎస్సీ కార్పోరేషన్ నిధులను పక్కదారి పట్టించి మోసం చేశారని ఆరోపించారు. దళితులు, క్రైస్తవులు, ముస్లిం మైనార్టీల ఓటు బ్యాంకు తో అధికారంలోకి వచ్చి వారిని విస్మరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు, సబ్ ప్లాన్ నిధులు వాడుకున్న పార్టీకి పుట్టగతులు లేకుండా చేస్తామన్నారు. టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు జంబులయ్య, రత్నస్వామి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామికి పూజలు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 19: మండలంలోని తర్తూరు లక్ష్మీరంగనాథ స్వామిని శుక్రవారం ఆలయ అధికారులు, భక్తులు మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాగేంద్రుని సేవకు ముందు స్వామివారికి ఇష్టమైన మల్లెపూలతో అలంకరిం చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకించారు.

రెండో రోజు నామినేషన్లు దాఖలు

ఆత్మకూరు, ఏప్రిల్ 19: వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలకు రెండో రోజైన శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి తెలిపారు. ఆమె మాట్లాడుత. జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా సున్నిపెంట గ్రామానికి చెందిన సయ్యద్ మహమ్మద్ సికిందర్ బాషా, వైసీపీ అభ్యర్థిగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తరుపున ఆ పార్టీ నాయకులు సయ్యద్‌మీర్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. కాగా ఇప్పటి వరకు మొత్తం 5 నామినేషన్లు దాఖలైనట్లు ఆమె తెలిపారు. ఇదిలావుంటే నామినేషన్ ప్రక్రియ వద్ద పోలీసులు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్వో కార్యాలయానికి వందమీటర్ల వరకు 144 సెక్షన్ విధించారు.

నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గంలో నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. మొదటి రోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాకపోగా, రెండో రోజైన శుక్రవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బీఎస్పీతరపున గడ్డల లాజర్, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ తరుపు కె.వెంకటేశ్వర్లు, ఇండియా ప్రజాబంద్ పార్టీ తరపున పల్లె నాగరాజులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో దాసు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

మిడుతూరు, ఏప్రిల్ 19: మండలంలోని తలముడిపి గ్రామానికి చెందిన పుల్లయ్య(30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పుల్లయ్య బుధవారం రాత్రి గడివేముల మండలం నుంచి తలముడిపి గ్రామానికి వస్తూ బైక్‌పై నుంచి జారి కింద పడ్డారు. చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. తండ్రి సువార్తయ్య ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి..

పగిడ్యాల, ఏప్రిల్ 19: పగిడ్యాలకు చెందిన నాగరాజు (37) చికిత్స పొందుతూ మృతి చెందారు. ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ తెలిపిన వివరా లివీ.. నాగరాజు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నారు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 15న అధిక మోతా దులో ట్యాబ్లెట్లు వేసుకోవడంతో అపస్మారకస్థితికి చేరుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్సల నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. నాగరాజు భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు

● టీడీపీ అభ్యర్థి బుడా రాజశేఖరరెడ్డి



టీడీపీలో చేరిన వలంటీర్లు, కార్యకర్తలతో బుడ్డా రాజశేఖరరెడ్డి



టీడీపీలో చేరిన యువకులతో టిడీపీ అభ్యర్థి బుడ్డా

వెలుగోడు, ఏప్రిల్ 19: రాష్ట్రంలో టీడీపీతోనే రాష్ట్ర యువతకు భవిత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం వేల్పనూరులోని ఆయన స్వగృహంలో వెలుగోడు పట్టణానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. వెలుగోడు పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు మండ్ల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లు అనే వలంటీర్‌తో పాటు శ్రీనివాసులు, వెంకటస్వామి రమేష్, శీనుతో పాటు పలువురు బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే టీడీపీ నాయకులు మోమిన్ రసూల్, సయ్యద్ ఆధ్వర్యంలో మరో 15 కుటుంబాలు బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరాయి. త్రిలోక్ ఆధ్వర్యంలో తన అనుచరులు బుడ్డాను కలిసి టీడీపీలో చేరారు. బుడ్డా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరూ టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. యువత ఉద్యోగావకాశాలు కావాలంటే చంద్రబాను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: గౌరు చరిత

పాణ్యం, ఏప్రిల్ 19: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. మండలంలోని గగ్గటూరు, ఎస్.కొత్తూరు, అనుపూరు, గోనవరం, ఆలమూరు గ్రామాలలో శుక్రవారం టీడీపీ శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌరు చరిత మాట్లాడుతూ గగ్గటూరులో టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. పంటరస్తాలు, ఇళ్ల మంజూరు, పింఛన్లు తదితర సమస్యల పరిష్కరించినట్లు గుర్తుచేశారు. మునుకుందు వాగు ప్రమాదకరంగా మారి వాహనదారులు మృత్యువాత పడుతున్నా నాయకులకు చీమకుట్టినట్లు లేదని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మునుకుందువాగుపై వంతెన నిర్మిస్తామన్నారు. వైసీపీ పాలనలో అక్రమంగా మట్టి తవ్వకాలు, భూ ఆక్రమణలు, గంజాయి, మద్యం అక్రమ రవాణాతో అక్రమ సంపాదించుకున్నారన్నారు. గగ్గటూరుకు బస్సు సౌకర్యాం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆలమూరు పడమటి భూములు ముంపునకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. రైతులు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినా ఇంత వరకు చలనం లేక దాదాపు వంద ఎకరాల భూములు ఎస్సార్బీసీ ముంపుకు గురై బీడుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, బడుగు వర్గాల అభివృద్ధి కోసమే చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారన్నారు. తల్లికి వందనంలో భాగంగా ఇంట్లో చదివే పిల్లలందరికీ ప్రతి ఏటా రూ. 15వేలు, 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.15 వందలు, ఏటా ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పిస్తుందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉపాధి. నిరుద్యోగ యువకులకు ప్రతి నెలా యువగళం నుంచి రూ. 3 వేలు జీవన భృతి కింద అంస్తామన్నారు. రైతులకు ప్రతి ఏటా రూ. 20 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఎస్సీ ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టానికి దీటుగా వైసీపీ అరాచకాలను ఎదుర్కొనేందుకు బీసీలకు రక్షణ చట్టంను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇంటింటికి మంచి నీరు పథకం కింద ప్రతి ఇంటికి రక్షిత తాగునీటి కొళాయి కనెక్షన్ కల్పిస్తామ న్నారు. పేదలను సంపన్నులను చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. ఐదేళ్లలో కనీసం రెట్టింపు ఆదాయం చేకూరేలా టీడీపీ మేనిఫెస్టో తయారు చేసిందన్నారు. గోనవరం గ్రామ పంచాయతీ 10వ వార్డు మెంబరు సంజమ్మతో పాటు మరో 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సామేల్, బాబు టీడీపీకి తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగరమేష్, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, జమాల్‌బాషా, దానం, సురేష్, నారాయణ, రామగోవిందరెడ్డి, మనోహర్, చంద్రశేఖరరెడ్డి, మాధవ నాయకులు పాల్గొన్నారు.



వార్డు సభ్యురాలిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గౌరు చరిత

నంద్యాల టీడీపీ అభ్యర్థిగా ఫరూక్ నామినేషన్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 19: నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా ఎన్ఎండీ ఫరూక్ శుక్రవార నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ఆయన మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నంద్యాల తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఫరూక్ వెంట టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రారావు, టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ తదితరులు ఉన్నారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన తర్వాత కార్యాలయ ఆవరణలో ఫరూక్ మీడియాతో మాట్లాడారు. ప్రజలను అన్ని విధాలుగా ఇబ్బంది పెట్టిన జగన్‌మోహన్ రెడ్డికి ఓటు అడిగే నైతిక హక్కు లేదని అన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, మౌలిక సమస్యలను, తమ దృష్టికి తీసుకువస్తుంటే తీవ్ర ఆవేదనకు గురికావాల్సి వస్తోందన్నారు. ప్రజలు టీడీపీ పక్షాన ఉన్నారని, అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే నంద్యాలలో స్థానిక ప్రజా ప్రతినిధి అభివృద్ధి చేశామంటూ ఊదరగొట్టుకోవడమే తప్ప చేసిందేమీ లేదని అన్నారు. నంద్యాల నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారంలో వైసీపీ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు.

ప్రజలు ఓటుతోనే బుద్ధి చెబుతారు: శబరి

వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. ఫరూక్ నామినేషన్ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అన్ని రంగాలను నిర్వీర్యం చేసిన జగన్‌కు ఏ వర్గ ప్రజలు ఓటు వేయరని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగంతో ఇబ్బందుపడుతున్నారని అన్నారు. పెరిగిన ధరలు, బిల్లులు, పన్నులతో సగటు మానవుడు కుదేలయ్యారని ఆమె అన్నారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించలేని దౌర్భాగ్య ముఖ్యమంత్రిని ప్రజలు ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు.



నామినేషన్ వేయడానికి వెళ్తున్న ఎన్ఎండీ ఫరూక్

టీడీపీ మేనిఫెస్టోతో అందరికీ న్యాయం: మాండ్ర



మండ్లెం గ్రామంలో ప్రచారం చేస్తున్న మాండ్ర శివానందరెడ్డి

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 19: టీడీపీ మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని మండ్లెం గ్రామంలో శుక్రవారం రాత్రి టీడీపీ ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ 6 పథకాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంచారు. టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, రవికాంత్, రఘుయాదవ్, తిరుపాలు, సుధాకర్, తిరుపతిరెడ్డి, కోటీశ్వరరెడ్డి, శివన్న, సోఫ్‌సా, రహిమాన్, సలాం, రషీద్, మాబాషా, గౌస్ పాల్గొన్నారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలం, ఏప్రిల్ 19: శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిన మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాదికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ

శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహగణపతి పూజ చేశారు.

వైభవంగా మహానందీశ్వరుడి పల్లకీ సేవ

మహానంది, ఏప్రిల్ 19: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి మహానందీశ్వరుడి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మంటపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకీపై ఆశీనులు చేశారు. అనంతరం వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రాలతో పాటు పల్లకీ ఉత్సవాన్ని భక్తుల శివనామస్మరణ మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నందికొట్కూరుకు షర్మిల రాక



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్

నందికొట్కూరు, ఏప్రిల్ 19: ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదివారం నందికొట్కూరుకు వస్తున్నారని నంద్యాల డీసీసీ లక్ష్మీనరసింహ యాదవ్, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి తోగూరు ఆర్థర్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లక్ష్మీనరసింహాయాదవ్ మాట్లా డుతూ ప్రాంతీయ పార్టీల్లో దళిత ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఉండదని, కేవలం జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఉంటుందని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉన్న ఎమ్మెల్యేను తమ కబంధ హస్తాల్లోకి తీసుకోవాలనుకున్న వైసీపీ స్థానిక నాయకులను వ్యతిరేకించి కాంగ్రెస్‌లో ఆర్థర్ చేరారన్నారు. షర్మిల బ్రాహ్మణకొట్కూరుకు సాయంత్రం 4 గంటలకు చేరుకొని అక్కడ రోడ్డు షో నిర్వహించి, అనంతరం నందికొట్కూరు కొత్త బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. అనంతరం నంద్యాలకు బయలుదేరతారన్నారు. ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు ప్రజల్లో ఉన్నానని, ఎలాంటి అవినీతి పాల్పడలేదని అన్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వరీదేవికి వెండి కాసుల హారం

మహానంది, ఏప్రిల్ 19: మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి బంగారు పూత పూసిన వెండి కాసుల హారాన్ని మహానంది గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్వో కె.సత్యనారాయణ దంపతులు అందచేశారు. శుక్రవారం ఆలయం ప్రాంగణంలోని విరాళాల కౌంటర్‌లో సుమారు రూ.50 వేలు విలువ చేసే 59 గ్రాముల బంగారు పూత పూసిన వెండి కాసుల హారాన్ని ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధుకు అప్పగించారు. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లు రాజీనామా

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 19: మండలంలోని పారుమంచాల గ్రామంలో శుక్రవారం వలంటీర్లు రాజీనామా చేసి పత్రాలను పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్‌కు అందజేశారు. తమ వ్యక్తిగత కారణాలవల్ల రాజీనామా చేస్తున్నట్లు చెప్పారని పంచాయతీ కార్యదర్శి చెప్పారు. రాజీనామా చేసిన వారిపత్రాలను ఇన్‌చార్జి ఎంపీడీవో నూర్జహాన్‌కు అందజేసినట్లు చెప్పారు.

కొత్తపల్లి: కొత్తపల్లి గ్రామ పంచాయతీలో 11 మంది గ్రామ వాలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ చిన్నస్వామికి తమ రాజీనామ పత్రాలను అందజేశారని తెలిపారు. కొత్తపల్లిలో మొత్తం 18 మందిలో 11 మంది వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు చెప్పారని తెలిపారు. ఈ రాజీనామా పత్రాలను కలెక్టర్‌కు పంపుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

సైకిలెక్కిన స్వతంత్ర కౌన్సిలర్

● హైదరాబాద్‌లో నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిక

● వైసీపీని వీడిన ఆర్యవైశ్య, బలిజ సంఘం నాయకులు



నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 19: నంద్యాల మున్సిపాలిటీ 12వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ ఖండే శ్యామసుందర్ లాల్, ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి బింగుమళ్ల శ్యామసుందర్ గుప్తా, యోగా గురూజీ ఆనంద్ కుమార్ శుక్రవారం సైకిలెక్కారు. కౌన్సిలర్‌తో పాటు ఆర్యవైశ్య, బలిజ సంఘం నాయకులు టీడీపీ నంద్యాల అభ్యర్థి న్ఎండీ ఫరూక్ తనయుడు ఖలీల్ అలియాస్ బబ్లూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, సీనియర్ నేత ఏవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే టీడీపలో చేరిన వారిలో వైసీపీ 20వ వార్డు ఇన్‌చార్జి కండిమల్ల వెంకట నరేష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తొమ్మండ్ల నాగరాజు, నంద్యాల డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శేగు శ్రీనివాసులు, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ కోశాధికారి గెలివి శేఖర్, రైతు సంఘం నాయకులు చింతల కుమార్, బలిజ సంఘం నాయకులు ఉల్లి నాగేశ్, సంఘం నాయకులు కేశవకుమార్ చౌదరి, కేవీ బాబు, నంద వెంకటేశ్వర్లు, ఇల్లా రమణ యాదవ్, జనసేన నాయకులు నూకల కృష్ణ ఉన్నారు. ఆర్యవైశ్య, బలిజ సంఘం నాయకులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆర్యవైశ్య, బలిజ సామాజిక వర్గాలను నిర్లక్ష్యం చేశారని, వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలని నారా లోకేశ్ సూచించారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించినట్లు ఆర్యవైశ్య, బలిజ సంఘం నాయకులు తెలిపారు.

మహానందిలో వైసీపీకి షాక్

● చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపీపీ, సర్పంచ్, సీనియర్ నాయకులు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మహానంది, ఏప్రిల్ 19: మహానంది మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మొదటి నుంచి వైసీపీలో ఉండి ఎంపీపీ పదవి చేపట్టిన సీతారామపురం గ్రామానికి చెందిన బుడ్డారెడ్డి యశస్వినిరెడ్డి సీతారామపురం గ్రామ సర్పంచ్ తేజస్వినిరెడి, వారి తండ్రి బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆలూరులో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అలాగే తిమ్మాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, బుక్కాపురం కందుల భూపాల్‌రెడ్డి, మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లిఖార్జునరావు, బుక్కాపురం జయరాముడు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం భారీ సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో ఆలూరుకు వెళ్లి టీడీపీలో చేరారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు, నంద్యాల ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి తదతరులు ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: బైరెడ్డి



వేంపెంటలో పర్యటిస్తున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి

పాములపాడు, ఏప్రిల్ 19: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల దిబ్బగా మారిందని, తిరిగి ఆంధ్రప్రదేశ్ అబివృద్ధి వైపు పరుగులు పెట్టాలంటే ఒక్క తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని వేంపెంట, బానకచెర్ల, ఇస్కాల, లింగాల గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బైరెడ్డి మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ వైసీపీ అధికారం చేపట్టి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. ఇసుక దోపిడీ, నాసిరకం మద్యంతో కోట్ల రూపాయలు ఆర్జిస్తూ పేదల జీవితాలను నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ అసమర్థ పాలనతో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు జీవించలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నందికొట్కూరు నియోజకవర్గంలో మల్యాల, ఇస్కాల ఎత్తిపోతల పథకాల ద్వారా రైతాంగానికి సాగునీరందించిన ఘనత టీడీపీదేనన్నారు. లింగాల గ్రామంలో సీపీఎం సభ్యులతో పాటు మరికొందరు బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి బైరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో రమేశ్, నాగేశ్వరరావు, శ్రీనివాసులు నాయుడు, వేమారెడ్డి, రఘునాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, లింగస్వామి, కలిముల్ల, శ్రీనివాసరెడ్డి, చిన్న వెంకటరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన: జయసూర్య



పీర్‌సాహెబ్ పేటలో ప్రచారం చేస్తున్న జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 19: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన కొనసాగించిందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిణ గుణపాటం చెప్పాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని ఏబీఎం పాలెంలో శుక్రవారం బాబు సూపర్ 6 డోర్ టూ డోర్, ఎన్నికల శంఖారావం కార్యక్రమాన్ని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, గిత్తా జయసూర్య నిర్వహిచారు. జయసూర్య మాట్లాడుతూ 'ఆశీర్వదించి అసెంబ్లీకి పంపితే మీలో ఒకడిలా ఉంటాను అని' అన్నారు. కార్యక్రమంలో మాండ్ర పురుషోత్తంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కళాకారు, నిమ్మకాయల రాజు, మోహన్, బుల్లెద్దుల రాజన్న, ప్రసాద్, మోష, తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి గిత్తా జయసూర్య తెలిపారు. మండలంలోని పీరుసాహెబ్‌పేటలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సుందర్ రెడ్డి, రామేశ్వర రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, జయరాముడు, విష్ణువర్ధన్ రెడ్డి, క్రిష్ణ, రవికుమార్, రాజా రెడ్డి, మహేశ్వర రెడ్డు పాల్గొన్నారు.

చౌడేశ్వరికి జ్యోతి ఉత్సవాలు



చౌడేశ్వరీ దేవి జ్యోతుల ఊరేగింపు

బేతంచెర్ల, ఏప్రిల్ 19: పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో ఉన్న చౌడేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారికి జ్యోతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని గౌరిపేటలో వెలసిన సుంకులాప రమేశ్వరీదేవి ఆలయం నుంచి 19 జ్యోతులను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేర్చారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అహోబిలంలో ఏకాదశి పూజలు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న వేదపండితులు

నంద్యాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో శుక్రవారం ఏకాదశి పూజలను వేదపండితులు నిర్వహించారు. విశ్వరూప సేవ అనంతరం ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వేకువ జామున్నే ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

చికిత్స పొందుతూ ఇద్దరు రైతుల మృతి

బేతంచెర్ల, ఏప్రిల్ 19: నంద్యాల జిల్లాలో చికిత్స పొందుతూ ఇద్దరు రైతులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్ల మండలం ఎం.పెండేకల్ గ్రామానికి చెందిన చెవిటి చిన్న పుల్లయ్య (37) అనే రైతు ఈనెల 17న అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం బేతంచెర్ల సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవార మృతి చెందాడు. మృతుడి భార్య దస్తగిరమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఏఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా బేతంచెర్ల మండలం ఎంబాయి గ్రామానికి చెందిన పసుపుల చిన్న మద్దిలేటి (51) అనే రైతు అప్పుల బాధతో ఈ నెల 16న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ మాసూమ్ తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ : కేసు నమోదు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని నందిపాడు గ్రామంలో ఇరు వర్గాల ఘర్షణకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ గోపినాథరెడ్డి శ్రుకవారం తెలిపారు. గ్రామానికి చెందిన దేవేంద, లోక్‌నాథరెడ్డి రాబోయో ఎన్నికలకు సంబంధించి మాట్లాడు కుంటూ మాట మాట పెరగడంతో దేవేంద లోక్‌నాథరెడ్డిని నోటితో కొరికి గాయపరిచారన్నారు. దీంతో లోక్‌నాథరెడ్డి మరో ఐదుగురితో కలిసి దేవేం దకు సంబంధించిన ఆటోను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైసీపీలో అభివృద్ధి శూన్యం

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 19: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని టీడీపీ మండల అధ్యక్షుడు, నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నందవరం గ్రామంలో పీవీ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెలుంలో మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని బెలుంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 26వ తేదీ నుంచి 28 వరకు మారెమ్మ తల్లి, సత్యమ్మ దేవతా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహ కుడు అన్నయ్య శ్రుకవారం తెలిపారు. మారెమ్మ, సత్యమ్మ తల్లి విగ్రహాలతో పాటు, బొడ్డురాయి, నాభిశిల ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు.

22న జాతీయ సెమినార్

కోవెలకుంట్ల, ఏప్రిల్ 19: కోవెలకుంట్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్విరాన్‌మెంట్ పొల్యూషన్, సస్టెయినబుల్ మెటీరియల్ అనే అంశంపై సెమినార్ జరుగుతుందన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణదాసు, కన్వీనర్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండో రోజు నామినేషన్లు నిల్

నంద్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ అసెంబ్లీకి రెండో రోజున ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. నామినేషన్లను ఈనెల 25వ తేది వరకు స్వీకరిస్తామని చెప్పారు.

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలో రెండో రోజు నామినేషన్లు ఎవ్వరూ వేయలేదని బనగానపల్లె ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పార్టీలకు చెందిన నాయకులు శనివారం నుంచి నామినేషన్లు వేయనుండడంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈసందర్భంగా డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు.

ముస్లింల ద్రోహి కాటసాని

» బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి

» వైసీపీని వీడి టీడీపీలో చేరిన ముస్లిం కీలక నేతలు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 19: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముస్లింల ద్రోహి అని బనగానపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు ఎస్‌ఏ గఫూర్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు 60 మంది శుక్రవారం టీడీపీలో చేరారు. వారందరికీ బీసీ జనార్దన్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల ముస్లింలకు షాదిఖానా నిర్మిస్తానని చెప్పి నమ్మించి ఎమ్మెల్యే మోసం చేశారని అన్నారు. కాటసాని చేసిన నమ్మక ద్రోహానికి ఆగ్రహించి ముస్లిం మైనార్టీ నేతలు వైసీపీని వీడారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కోవెలకుంట్ల ముస్లింల కోసం షాదీఖానా నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ముస్లిం వ్యతిరేక చట్టాలకు పార్లమెంట్ మద్దతు ఇచ్చి ద్రోహం చేసిందన్నారు. కమ్యూనిటీ హాలులో కనీస సౌకర్యాలు లేకుండానే ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారని మండిప డ్డారు. పేద ముస్లింలకు పట్టాలు కూడా ఇవ్వలేదన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలకు ఆకర్షితులమై బీసీ జనార్దన్‌రెడ్డికి మద్దతుగా టీడీపీలో చేరామన్నారు.

టీడీపీలో చేరిన భీమునిపాడు సర్పంచ్ ప్రదీప్‌కుమార్: కోవెలకుంట్ల మండలం భీమునిపాడు సర్పంచ్ పూజారి ప్రదీప్‌కుమార్ వైసీపీకి ఝలక్ ఇస్తూ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ గ్రామనాయకుడు సునీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కోవెలకుంట్ల టీడీపీ కార్యాలయంలో ప్రదీప్‌కుమార్ బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీలో చేరిన వైసీపీ దళిత నేతలు

బనగానపల్లె: దళితుల అభ్యున్నతికి కృషి చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని బనగానపల్లె టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో కొలిమిగుండ్ల మండలం పెట్నికోటకు చెందిన వైసీపీకి చెందిన పలువురు దళిత నేతలు వైసీపీని వీడ బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెట్నికోట ఎస్సీ కాలనీకి చెందిన మండ్ల ఆంజనేయులు వెంకటరమయ్య, బళ్లారి పెద్దన్న, చిన్నపెద్దన్న, శ్రీరాములు తదితర 25 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో తమకు రక్షణలేదన్నారు. బనగానపల్లె అభివృద్ధి చెందాలంటే బీసీ తోనే సాధ్యమని అందుకే వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు.

నేడు బీసీ జనార్దన్‌రెడ్డి నామినేషన్

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం నామినేషన్ వేయనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు బనగానపల్లె తహసీల్దారు కార్యాలయం ఆవరణలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేయనున్నారు. ఈసందర్భంగా బీసీ మాట్లాడుతూ వైసీపీ అవినీతి పాలనకు అంతం పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. యాగంటి ఉమామహేశ్వరస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, అల్లా, ఏసుక్రీస్తు ఆశీర్వాదాలు తనకు సంపూర్ణంగా ఉన్నాయని అన్నారు.





మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన పెట్నికోట, లింగాల వైసీపీ నాయకులు



బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లిం మైనార్టీలు

బీసీ మాట్లాడుతూ ఎంతోమంది దళితులను దారుణంగా హత్య చేసి వైసీపీ నాయకులు పొట్టనబెట్టుకున్నారు. వైసీపీ రాక్షసపాలనను అంతం చేయడానికి దళితులు టీడీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు.

వెలగటూరు, గుంజలపాడు, లింగాల వాసులు..

కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామానికి చెందిన 16 కుటుంబాలు వైసీపీని వీడి శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అందెప్రసాద్‌రెడ్డి, గడ్డం విశ్వనాథరెడ్డి, నేరబోయిన శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ ఓర్వకంటి ప్రసాద్ తదితరులు ఇందులో ఉన్నారు.

గుంజలపాడులో: కోవెలకుంట్ల మండలం గుంజలపాడు గ్రామానికి చెందిన వైసీపీ నేతలు ఆ పార్టీని వీడి శుక్రవారం పొట్టిపాడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వెంకటరాముడు, సుబ్బయ్య, తిరుపతి, మాసూం, బాష, టైలర్ రంగడు తదతర 25 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. బీసీ జనార్దన్ రెడ్డి వారికి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

లింగాలలో: కోవెలకుంట్ల మండలంలోని లింగాల గ్రామానికి చెందిన 35 వైసీపీ కుటుంబాలు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. సిరిపి బాలవెంకటరెడ్డి, బొక్కెం ప్రతాప్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి ఉన్నారు.

సంజామల: సంజామల గ్రామానికి చెందిన 200 కుటుంబాలకు చెందిన వైసీపీ వారు టీడీపీలో చేరారు. వారికి బీసీ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ యూసుప్ హుసేన్, రెడ్డి మగ్బుల్, మహమ్మద్‌హుసేన్, మున్నీర్, మహమ్మద్ రఫీ, రఘురామయ్య, రాజారెడ్డి, ఓబుళరెడ్డి, తులసిరరెడ్డి, శివారెడ్డి, కుమ్మరి జగ్గయ్య, నాగిశెట్టి, ప్రభాకర్ ఉన్నారు. కార్యక్రమంలో కమలపురి సర్పంచ్ విజయలక్ష్మి, కానాల కేశవరెడ్డి, తులసిరెడ్డి, ప్రచార కార్యదర్శి పల్లెరోగి మహేశ్, శిల్పాసుబ్రహ్మణ్యం, కోడూరు పెద్దపుల్లయ్య, మద్దిలేటి, హుసేన్, శేషారెడ్డి, బడి ప్రతాప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, భాస్కర్, శీల్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాసచౌదరి, మాధవ, సానెంరవి, సుబ్బారావు, తోట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతోనే ప్రజలకు లబ్ధి

అవుకు, ఏప్రిల్ 19: సూపర్ సిక్స్ పథకాలతోనే ప్రజలకు లబ్ధి చేకూరుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా కాటసాని చంద్రశేఖ ర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి అవుకు మండలం అన్నవరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు ప్రవేశ పరీక్ష

బేతంచెర్ల, ఏప్రిల్ 19: మండలంలోని గోరుమానుకొండ ఏపీ ఆదర్శ పాఠశా లలో ఆరో తరగతి ప్రవేశం కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ మరియదాస్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడు చేసుకోవాలన్నారు.

డోన్(రూరల్): పట్టణ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరే విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఆదివారం జరుగుతుందని ప్రిన్సిపాల్ జాస్మిన్ తెలిపారు.

రుద్రవరంలో వర్షం

» తడిసిన ధాన్యం

» రేకుల షెడ్లు కూలి ఇద్దరికి తీవ్ర గాయాలు

నంద్యాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి)/రుద్రవరం: మండలంలో శుక్రవారం ఉరుములు, మెరుపు గాలులతోకూడుకున్న వర్షం కురిసింది. పంట పొలాల్లో వరి ధాన్యం తడిసి ముద్ద అయింది. చేతికి అందిన పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డి.కొట్టాల, శ్రీరంగాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శ్రీరంగాపురంలో విశ్రాంత వీఆర్వో మల్లేశ్వరుడికి చెందిన రేకుల షెడ్డుతో పాటు మరో ఐదు రేకుల షెడ్లు కూలిపోయాయి. డి.కొట్టాలలో ఆరు రేకుల షెడ్లు, మూడు గుడిసెలు నేలకూలగా.. రేకుల షెడ్లు పడి నరంహారెడ్డి, నరసింహ తీవ్రంగా గాయపడ్డారు.

ఈదురు గాలులతో తేలికపాటి వర్షం: ఆళ్లగడ్డ ప్రాంతంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో తెలిపాటి వర్షం కురిసింది. గాలులతో పాటు ఉరుములు, మెరుపులు మెరిశాయి. గాలులకు పట్టణంలోని శోభా నాగిరెడ్డి కాలనీలో చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గత రెండు, మూడు రోజుల నుంచి వేసవి ఎండలు విపరీతంగా కాయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి చెందారు. ఈ తరుణంలో బలమైన గాలులతో కూడిన తెలికపాటి వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం చెందారు.



వరి ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

చెలిమ నీరే గతి

» రోజు మార్చి రోజు తాగునీటి సరఫరా

» గుళ్లదుర్తి గ్రామంలో దాహం

» తాగునీటి కోసం 6 కిలోమీటర్లు వెళ్లాల్సిందే

కోవెలకుంట్ల, ఏప్రిల్ 19: ఎండలకు వాగులు, వంకలు, చెరువులు ఎండిపోయాయి. ఈ ప్రాంత ప్రజలకు జీవనాధారమైన కుందూనది కూడా ఎండి పోయింది. దీంతో నది పరివాహక ప్రాంత గ్రామాలకు తాగు, సాగు నీరు అందడం లేదు. అలాంటి గ్రామాలలో గుళ్ళదుర్తి ఒకటి. ఊళ్లో సుమారు 5వేల మంది నివసిస్తున్నారు. వీళ్ల దాహం తీర్చుకోడానికి కుందూ నదిలో చెలిమ కాలువ తొవ్వుకొని దాహం తీర్చు కుంటున్నారు. ఈ గ్రామస్థులు వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధార పడి జీవిస్తున్నారు. ఈ గ్రామానికి పక్కనే కుందూనది ఉంది. గత ఏడాది దాకా కుందూనదిలో నీరు ఉండేది. విద్యుత్ మోటర్లను అమర్చి అక్కడి నుంచి గ్రామానికి తాగునీటిని సరఫరా చేసేవారు. ఈ ఏడాది మార్చిలోనే కుందూ ఎండిపోయింది. గ్రామస్థులకు తాగు, సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఉండడంతో అక్కడి నుంచి ఒకటి లేదా రెండు బందెలు నీటిని తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నామని ప్రజలు అంటున్నారు. మరికొంతమంది సంజామల గ్రామానికి వెళ్లే రహదారిలో 6 కిమీ దూరంలో ఉన్న కుంటవద్దకు వెళ్ళి నీరు తెచ్చుకుంటున్నారు. ఈ ఇబ్బంది చూసి గ్రామ పెద్దలు కుందూ నదిలో అర కిలోమీటర్ దూరం చెలిమ కాలువ తీశారు. ఈ కాలువలో ఊరుతున్న నీటిని రోజు మార్చి రోజు గ్రామానికి తాగునీరుగా సరఫరా చేస్తున్నారు. గ్రామంలో కొళాయిల ద్వారా నీరు అందని వాళ్లు చెలిమ దగ్గరికి వెళ్ళి నీరు తెచ్చుకుంటున్నారు. ఈ చెలిమ కుడా ఎండిపోతే తమ పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళనపడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కుందూ నదికి నీరు విడుదల చేయించి తాగు, సాగు నీటి కష్టాలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కుందూలో ఏర్పాటు చేసిన చెలిమ కాలువ

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్(రూరల్), ఏప్రిల్ 19: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి రంగస్వామి గౌడ్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మహాలక్ష్మి ప్రైవేటు హాస్పిటల్, వాణి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వద్ద అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన పోస్టర్ల ప్రదర్శన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్వామిగౌడు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు క్షేమంగా బయటపడేందుకు సరైన ప్రణాళికతో అందరికీ తెలిసే విధంగా ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని భద్రతా నియామాలు పాటించాలి

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 19: అనుకోకుండా సంభవించే అగ్ని ప్రమాదాలను ఎదుర్కొవడానికి ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటించాలని బనగానపల్లె డివిజన్ అగ్నిమాపక శాఖ అధికారి ఎం.నరసింహులు అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని లైట్ ఎంఆర్ ఆసుపత్రితోపాటు, మండలంలోని గ్రామాల్లో పాఠశాలు, ప్రైవేటు ఆసుప్రతులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులకు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.

లింగమయ్య స్వామికి పూజలు

రుద్రవరం, ఏప్రిల్ 19: మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలోని కొలువుదీరిన లింగమయ్య స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

కన్యాకా పరమేశ్వరికి.. రుద్రవరంలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పూజ దాతలు ఈపూరి రంగనాథ్ దంప తులు పూజ సామగ్రిని అమ్మవారికి అందజేశారు. ఆర్యవైశ్యులు భారీ సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మద్యం విక్రేత అరెస్టు

సంజామల, ఏప్రిల్ 19: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి శనివారం తెలిపారు. అక్కంపల్లె గ్రామానికి చెందిన శివరాంరెడ్డి అను వ్యక్తి అక్కంపల్లె శివార్లలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి 60 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు: మండలంలోని నొస్సం గ్రామ శివార్లలో అంతర్ జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. ఈచెక్ పోస్టు వద్ద శనివారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం డబ్బు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వలంటీర్లు రాజీనామా

నంద్యాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలో 19 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. శ్రీరంగాపురం, మందలూరు, ఎర్రగుడిదిన్నె, నరసాపురం, రుద్రవరం గ్రామాల వలంటీర్లు కార్యదర్శుల ద్వారా రాజీనామా పత్రాలు ఎంపీడీవోకు అందజేసినట్లు తెలిపారు.

అధ్వానంగా రహదారులు



కంకర తేలిన గొట్లూరు రహదారి

చాగలమర్రి, ఏప్రిల్ 19: మండలంలోని గొట్లూరు గ్రామం నుంచి నేలంపాడు గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. గుంతలమ యంగా మారడంతో రైతులు, వాహనదారులు నరకయాతన పడుతున్నారు. కొత్తపల్లె నుంచి డి.వనిపెంట, గొడిగనూరు నుంచి కొత్తపల్లెకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

'రాక్షస పాలనకు అంతం పలకాలి'

ఆళ్లగడ్డ/శిరివెళ్ల/రుద్రవరం: వైసీపీ రాక్షస పాలనకు అంతం పలకాలని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి అఖిలప్రియ పిలుపునిచ్చారు. రుద్రవరం మండలం టి.లింగందిన్నె గ్రామానికి చెందిన పెద్ద లింగమయ్య, శివలింగం, లింగమయ్య, నాగేంద్ర, సుధాకర్‌లతో పాటు 30 కుటుంబాలు ఆళ్లగడ్డ పట్టణంలోని మాజీ మంత్రి అఖిలప్రియ స్వగృహంలో శుక్రవారం చేరాయి. అలాగే ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు కృష్ణమూర్తి, బుసెట్టి మోహన్‌రావు, నాగేంద్ర తదితరులు భార్గవ్ రామ్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా శిరివెళ్ల మండలంలో భూమా అఖిలప్రియ ప్రచారం నిర్వహించారు.

పిల్లర్లకే పనులు పరిమితం

ఐదేళ్లయినా పూర్తి కానీ భవన నిర్మాణ పనులు



పిల్లర్లతో ఆగిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు

చాగలమర్రి, ఏప్రిల్ 19: చాగలమర్రిలో ఐదేళ్ల క్రితం ప్రారంభించిన తహసీల్దార్ భవన నిర్మాణం నేటికి పిల్లర్లకే పరిమితమైంది. ఈ భవనానికి రూ.95 లక్షలు నిధులు గత ప్రభుత్వ హయంలో మంజూరయ్యాయి. దీంతో పనులు ప్రారంభించి పిల్లర్ల వరకు వేసి నిలిపి వేశారు. ఇప్పటివరకు మళ్లీ భవన నిర్మాణ పనులు చేపట్టలేదు. పంచాయతీరాజ్ అధికారులు రెండు విడతలుగా భవన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపించిన ఫలితం లేదు. వైసీపీ ప్రభుత్వంలో పాలకులు, అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయ భవన పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.


వరిగడ్డి లారీలో చెలరేగిన మంటలు



మంటలను ఆర్పుతున్న స్థానికులు

రుద్రవరం, ఏప్రిల్ 19: మండలంలోని ముకుందాపురం గ్రామం నుంచి కడప జిల్లా మైదుకూరు ప్రాంతానికి వరిగడ్డి లోడు వెళుతుండగా శుక్రవారం విద్యుత్ తీగలు తగిలి లారీపై మండలు చెలరేగాయి. స్థానికులు వైవాన్ స్ప్రేలతో మంటలు ఆర్పారు వరిగడ్డి కట్టలు పూర్తిగా కాలిపోయాయి. లారీకి స్వల్పంగా కాలిపోయిందని స్థానికులు తెలిపారు.

'జగన్ ముఠాను తరిమికొట్టాలి'



టీడీపీలో చేరిన వారితో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

డోన్, ఏప్రిల్ 19: ప్రజల జేబులను లూటీ చేసిన సీఎం జగన్ ముఠాను తరిమికొట్టాలని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ దస్తగిరి, షరీఫ్, అన్వర్, ఇమామ్ బాషా, మహబూబ్ బాషా, అహ్మద్, బాబా ఫక్రుద్దీన్‌తో పాటు మరో 50 కుటుంబాలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్య గౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, లక్ష్మీనారాయణ యాదవ్, ఎస్ఎండీ రఫీ, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

ప్యాపిలి: టీడీపీ అధికారంలోకి వస్తే సాగు, తాగు నీటికి అధిక ప్రాధాన్యం కల్పిస్తామని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాయలంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లిన తాగునీరు అడుగుతున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో మండలంలో నిర్మించిన నీటి పథకాలకు బుగ్గన తన పేరు వేయించుకుంటున్నారని కోట్ల విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు టి శ్రీనివాసులు, రాజా నారాయణమూర్తి, రామ్మోహన్‌యాదవ్, చల్లా వీరాంజినేయులు పాల్గొన్నారు.